
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 10 ఆగస్టు 2024





ఆరు రోజుల్లో.. అన్న క్యాంటీన్లు

- పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధమవుతున్నాయి
- పురపాలక సంఘాల ఆధ్వర్యంలో శరవేగంగా పనులు
- వైసీపీ పాడుపెట్టగా.. కూటమి ప్రభుత్వం పునరుద్ధరణ
- తుది దశలో పనులు.. 15న ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- పేదల ఆహార భద్రతకు కట్టుబడిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి విడతలో 26 క్యాంటీన్ల పునరుద్ధరణ



నల్లచెరువు వద్ద అన్న క్యాంటీన్‌లో ఇంటీరియర్ పనులు

ఆకలితో ఎవరూ ఉండకూడదు.. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం పేదలకు అందుబాటులో ఉండాలి.. అనే సదాశయంతో గత టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. అయితే పేదల కడుపు నింపిన అన్న క్యాంటీన్లను 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాడుపెట్టింది. ఎన్ని విమర్శలు వచ్చినా జగన్ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై స్పందించలేదు. వైసీపీ ప్రభుత్వం పేదల కడుపు కొట్టగా నేటి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై దృష్టి సారించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ దిశగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలివిడతలో ఎంపిక చేసిన అన్న క్యాంటీన్ల ప్రారంభానికి అధికారులు శరవేగంగా పనులు చేపట్టారు. తుది దశకు ఆయా పనులు చేరగా ఇక ఆరు రోజుల్లో అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను ఇటీవల మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా పరిశీలించారు. అన్న క్యాంటీన్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని పేదలతో పాటు సామాన్యులు, దిన సరి కూలీలు ఎదురుచూస్తున్నారు.

(గుంటూరు, నరసరావుపేట - ఆంధ్రజ్యోతి, బాపట్ల, తెనాలి, మారీసుపేట)

మరో ఆరు రోజుల్లో.. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారంతో పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టిన అన్న క్యాంటీన్ భవనాలను అధికారులు పునరుద్ధరించారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు అన్న క్యాంటీన్‌లు సిద్ధమయ్యాయి. గతంలో ఎలా ఉన్నాయో అలానే క్యాంటీన్ భవనాలను పునరుద్ధరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న 26 క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను మున్సిపాల్టీలు చేపట్టాయి. గడిచిన నెలరోజులుగా నిర్వహిస్తున్న మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల పనులు పూర్తై భవనాలు కొత్త కళను సంతరించుకున్నాయి. విద్యుత్ సరఫరా, కొత్త పరికరాలు, సాఫ్ట్‌వేర్ సమీకరణ వంటి మౌలిక సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో అన్న క్యాంటీన్లన్నీ కొత్త శోభగులతో సిద్ధం కానున్నాయి. అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ పనులను పేదలు వచ్చి ఆశక్తిగా పరిశీలిస్తున్నారు. 15న ప్రారంభానికి సిద్ధమవుతుండంటంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ తమ ఆకిలి తీర్చేందుకు క్యాంటీన్‌లు ప్రాంభించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని పేదలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. క్యాంటీన్ల ద్వారా ఒక్కొక్క చోట ఐదు వందల మందికి అల్పాహారం, భోజనం అందించే దిశగా ఏర్పాట్లు జరగుతున్నాయి. అల్పాహారం ఇడ్లీ, పూరి, ఉప్మా ఇలా రోజుకొక రకం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. భోజనంలో ఒక కూర, సాంబారు, పెరుగు, రైస్ వడ్డించనున్నారు.

● నాడు ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. జిల్లాలోని 13 నగర, పుర పాలక సంఘాల్లో మొత్తం 29 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రతి రోజూ వేలాది మంది పట్టణ పేదలకు 5 రూపాయలకే టిఫిన్, భోజనం లభించేది. కేవలం 15 రూపాయలతో ఒక పేద వాడికి రోజు గడిచి పోయేది. నగర, పట్టణ ప్రాంతాల్లో ఉండే అభాగ్యులు హాయిగా కడుపు నింపుకునేవారు. భిక్షాటకులకు అన్న క్యాంటీన్ ఒక వరంలా మారాయి. ఆకలితో పస్తులుండాల్సిన బాధ వారికి తప్పింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినకూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు కూడా అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. అలాంటి అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. అయినా టీడీపీ శ్రేణులు వీలైన ప్రతి చోటా తమసొంత డబ్బులు ఖర్చు చేసి అన్నా క్యాంటీన్లను నిర్వహించారు. దానికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలితీర్చేందుకు పూనుకుంది.

● తెనాలిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో అన్నక్యాంటీన్ల పనులను మున్సిపల్ అధికారులు పూర్తి చేస్తున్నారు.

● బాపట్లలోని సూర్యలంకరోడ్డులో పాత కోర్టు భవనం పక్కనే 2018లో అప్పటి ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ రూ.36లక్షల వెచ్చించి అన్నక్యాంటిన్ భవనాన్ని నిర్మించగా వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరింది. దీనిని రూ.10 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న అన్నక్యాంటిన్‌ను ఈ నెల 15న ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.

● గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 8 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. నగరంలోని వ్యవసాయ కార్యాలయం,ఐడీ ఆస్పత్రి, జేకేసీ కళాశాల రోడ్డులోని టీడీసీ కార్యాలయం, మిర్చియార్డు, నల్లచెరువు వాటర్ ట్యాంకు, గుంటూరు బస్టాండు, మార్కెట్ సెంటర్లోని పల్నాడు బస్టాండ్ సెంటర్, పెదకూరపాడు రోడ్డులో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో గుంటూరు బస్టాండు, పల్నాడు బస్టాండు వద్ద ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల పనులు పూర్తయ్యాయి. మంగళగిరి పాత బస్టాండు, తాడేపల్లి, ఉండవల్లిలోని సీఎం ఇంటి వద్ద, రాష్ట్ర సచివాలయం వద్ద అన్న క్యాంటీన్లు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. మిగిలిన క్యాంటీన్లను సెప్టెంబరు 21లోగా ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతోంది.



ఎన్టీఆర్ బస్టాండు వద్ద అన్ని హంగులతో సిద్ధమైన అన్న క్యాంటీన్

గుండెపోటుకు చెక్



- హార్ట్‌స్ట్రోక్ మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- హార్ట్ కేర్ హబ్‌గా గుంటూరు జీజీహెచ్ ఎంపిక
- సామాన్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం హార్ట్ కేర్ సర్వీసులు
- సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఖరీదైన టెనెక్ట్ ప్లీస్ ఇంజక్షన్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 స్పోక్స్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి

గుండెపోటు.. ఎప్పుడు ఎలా ఎవరికి వస్తుందో తెలియదు. సకాలంలో చికిత్స చేయించుకోలేక ఎందరో మరణిస్తుంటారు. ఖరీదైన ఈ వైద్యం సామాన్యులకు అందుబాటులో లేదు. పైగా గుండెపోటు మరణాలు అధికమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గుండెపోటు మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంట చాలా కీలకం. ఆ సమయంలో ప్రాథమిక చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. అందుకు చాలా ఖర్చు అవుతుంది. ఆ ఖర్చును భరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడుంకట్టింది.

గుంటూరు సిటీ, ఆగస్టు 9: గుండెపోటు వచ్చినవారి ప్రాణాలు కాపాడే అతి ఖరీదైన ఇంజక్షన్ సామాన్యులకు అందుబాటులో తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అనుమతి ఇచ్చారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాను హార్ట్‌కేర్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికచేశారు. అందులో భాగంగా జీజీహెచ్‌ను హార్ట్‌కేర్ హబ్‌గా మార్చనున్నారు. గుండెపోటు సంభవించిన తొలి గంటను గోల్డెన్ అవర్ అని వైద్యులు చెబుతారు. ఆ తొలి గంటలో చేసే ప్రాథమిక వైద్యం రోగికి ప్రాణం పోస్తుంది. ప్రస్తుతం గుండెపోటు వచ్చిన వారికి టెనెక్ట్ ప్లీస్ అనే ఇంజెక్షన్ ఇస్తున్నారు. ఈ ఇంజెక్షన్‌కు గడ్డకట్టిన రక్తాన్ని కరిగించే శక్తి ఉంటుంది. దీని విలువ సుమారు రూ.25వేల నుంచి రూ.40వేల వరకు ఉంటుంది. చాలా సందర్భాల్లో ఆ ఖర్చు భరించలేక సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం టెనెక్ట్ ప్లీస్ ఇంజెక్షన్‌ను సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. స్పోక్స్ సెంటర్లలో టెనెక్ట్ ప్లీస్ ఇంజక్షన్ ఉచితంగా ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 స్పోక్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గుండెపోటు వచ్చినవారికి ఆయువు పోసే ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఆయా సామాజిక ఆరోగ్య కేంద్రాలను గుండెపోటు బాధితులు ఉండేందుకు తగ్గట్లుగా తీర్చిదిద్దనున్నారు. అక్కడ ప్రాథమిక చికిత్సలో భాగంగా రోగికి టెనెక్ట్ ప్లీస్ ఇంజెక్షన్ ఇచ్చి పరిస్థితి స్టేబుల్ చేసిన తర్వాత జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారు. ఆయా స్పోక్స్ సెంటర్ల నుంచి వచ్చే కేసులను అత్యంత ఎమర్జెన్సీగా భావించి వారికి అవసరమైన ఏంజియో గ్రామ్, స్టెంట్ ప్రక్రియను ప్రారంభిస్తారు.

గుంటూరే కీలకం

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు ప్రకారం గుంటూరు, నెల్లూరు, వైజాగ్, కడప జిల్లాల్లో మాత్రమే గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో అసంక్రమిత వ్యాధుల్లో ఎక్కువ శాతం మరణాలు గుండెపోటు వల్లే జరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. ఈ జిల్లాలో 49 సంవత్సరాల వయస్సు లోపు ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. 60 సంవత్సరాల వయస్సు తర్వాత మొత్తం గుండె జబ్బుల కేసుల్లో 21 నుంచి 25 శాతం మాత్రమే ఉంటున్నాయి. జిల్లాలో సంభవిస్తున్న మరణాల్లో 31 శాతం గుండె పోటు వల్లే ఉంటున్నాయి. వారిలో 75 శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆయా వర్గాలకు టెనెక్ట్ ప్లీస్ ఇంజెక్షన్ అందుబాటులోకి రావడం వల్ల మధ్యంతర మరణాలు నివారించవచ్చునని కూటమి ప్రభుత్వం ఖర్చుతో కూడిన వైద్యానికి శ్రీకారం చుట్టింది. గుండె పోటుకు గురై మరణించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలోనే కార్డియాలజీ, కార్డియో వాస్క్యులర్ సేవలను మరింతగా విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ వ్యవస్థను వినియోగించి గుండెపోటు లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని స్పోక్స్ సెంటర్‌కు తరలిస్తారు. అవసరమైన సిబ్బందిని కూడా నియమించే అవకాశం ఉంది.



జెండా ఆవిష్కరణపై స్పష్టత

- గుంటూరులో లోకేశ్, పల్నాడులో మనోహర్, బాపట్లలో రవిలకు అవకాశం

జిల్లాలకు మంత్రులను కేటాయించిన ప్రభుత్వం



గుంటూరు సిటీ/ నరసరావుపేట, బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తోంది. జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే దృష్టి సారించారు. వేడుకల ఏర్పాట్లపై యంత్రాంగం సమీక్షిస్తోంది. స్వాతంత్ర్య వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రుల నియామకం చేయలేదు. దీంతో జెండా ఆవిష్కరణ చేసే మంత్రులపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో జెండా ఆవిష్కరణలో పాల్గొనే అమాత్యుల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆగస్టు 15న జిల్లాల్లో జెండా వందనం చేసే మంత్రుల జాబితా శుక్రవారం ఖరారైంది. గుంటూరు జిల్లాలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, పల్నాడు జిల్లాలో ఆహార, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, బాపట్ల జిల్లా లో ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ జెండా వందనం చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి హోదాలో నాదెండ్ల మనోహర్ గతంలో జాతీయ జెండాను ఆవిష్కరించగా నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ మంత్రుల హోదాలో జెండా వందన కార్యక్రమాల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. నరసరావు పేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

గుంటూరుదే ఆ ఘనత

రాజకీయ చైతన్యానికి మారుపేరైన గుంటూరు జిల్లా కేంద్రంలో జాతీయజెండాను ఆవిష్కరించిన వారిలో రాజకీయ ఉద్ధండులు ఉన్నారు. ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించిన వారు తర్వాత కాలంలో ముఖ్య మంత్రులు కూడా అయ్యారు. ఇది గుంటూరుకు ఓ ప్రత్యేక ఘనతగా కొనసాగింది. కాసు బ్రహ్మానందరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, కొణిజేటి రోశయ్య అప్పట్లో జిల్లా మంత్రుల హోదాలో గుంటూరులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత కాలంలో వారు ముఖ్యమంత్రులుగా రాష్ట్ర రాజధానిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన గుంటూరు జిల్లా కేంద్రంలో మంత్రి లోకేశ్‌కు ఈసారి జాతీయ జెండా ఆవిష్కరించే అవకాశం దక్కింది.

రేంజిలో మరికొందరు సీఐల బదిలీ

గుంటూరు, ఆగస్టు 9: గుంటూరు రేంజ్ పరిధిలో మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గడిచిన కొద్దిరోజులుగా బదిలీల ప్రక్రియ కొనసాగు తున్న విషయం విధితమే. తాజాగా బదిలీ అయిన వారిలో ప్రకాశం జిల్లా పామూరు సీఐ ఎం రామానాయక్‌ను వట్టిచెరుకూరుకు, సీఐడీలో ఉన్న ఎన్ కిశోర్‌బాబును గూడూరు రూరల్‌కు, మద్ది శ్రీనివాసరావును నెల్లూరు త్రీ టౌన్‌కు బదిలీ చేశారు. వెంకటగిరిలో విధులు నిర్వహిస్తున్న ఎన్ సంగమేశ్వరరావును నాయుడు పేట రూరల్‌కు, ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో ఉన్న ఏ వెంకటరమణను వెంకటగిరికి, ఏసీబీలో ఉన్న జీఎల్ శ్రీనివాసరావును మార్టూరుకు, వీఆర్‌లో ఉన్న వైవీ రమణయ్యను ఇంకొల్లుకు, వై పాండు రంగారావును ఒంగోలు ట్రాఫిక్‌కి, బీ హరికృష్ణను బాపట్ల రూరల్‌కు, నెల్లూరు సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కామరాజు గడ్డ సాంబశివరావును నెల్లూరు ఆరో టౌన్ సీఐగా బదిలీ అయ్యారు.

గుంటూరు కమిషనర్‌గా పులి శ్రీనివాసులు

● గతంలో ఇక్కడ ఏసీగా, ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు



గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 9: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పులి శ్రీనివాసులును నియమిస్తూ శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా జేసీగా ఉన్న పులి శ్రీనివాసులు గుంటూరు కమిషనర్‌గా నియమితులయ్యారు. గతంలో ఆయన గుంటూరు నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్‌గా, ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఐటీడీఏ అధికారిగా, గుంటూరు డీఆర్వోగా సుదీర్ఘకాలం పని చేశారు. అనంతరం 2017లో ఆయన కన్‌ఫర్మ్‌డ్ ఐఏఎస్ ఉద్యోగోన్నతి పొందారు. ఆ తర్వాత సీసీఎల్‌ఏలో పనిచేసి, చిత్తూరు జిల్లా జేసీగా నియమితులయ్యారు. గత నెలలో జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో రాజమండ్రి కమిషనర్‌గా పనిచేస్తున్న కొత్తమాసు దినేష్‌కుమార్‌ను గుంటూరు కమిషనర్‌గా బదిలీచేశారు. అయితే ఆయన గుంటూరు కమిషనర్‌గా వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో మున్సిపల్ ఆర్‌డీగా ఉన్న సూర్యదేవర హరికృష్ణను కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పది రోజుల క్రితం ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో తాజాగా పులి శ్రీనివాసులును తిరిగి కార్పొరేషన్‌గుంటూరు కమిషనర్‌గా నియమించింది.



శ్రావణమాసం తొలి శుక్రవారం రోజున గుంటూరులోని అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవారి మూలవిరాట్‌లు



వర్సిటీకి దక్కిన న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ పత్రాలను చూపుతున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు

సమష్టి కృషి ఫలితంగానే నాక్ ఏ ప్లస్ గ్రేడ్

● వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు

పెదకాకాని, ఆగస్టు 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సమష్టి కృషితోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధ్యమైందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు అన్నారు. నాక్ కౌన్సిల్ నుంచి గురువారం వర్సిటీ కేటాయించిన నాక్ గ్రేడును నిర్ధారిస్తూ ప్రత్యేక సర్టిఫికెట్‌ను వర్సిటీకి పంపించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ నాక్‌కు సంబంధించి వర్సిటీ సాధించిన ఘనతగా పేర్కొన్నారు. గ్రేడు సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. నాక్ ఏ ప్లస్‌కు అనుసరించిన కార్యాచరణను నిరంతరం కొనసాగించాలన్నారు. ముఖ్యంగా ఆధ్యాపకులు వారు చేసే పరిశోధన పబ్లికేషన్‌లకు విశ్వవ్యాప్త గుర్తింపు ఉండేలా చూడాలన్నారు. అందుకుగాను స్కోపస్ వంటి ప్రముఖ జర్నల్స్‌ను ఎంపికచేసుకుని వాటికి అనుగుణంగా పరిశోధనపత్రాలు ప్రచురితమయ్యేలా చూడాలన్నారు. అలాగే అధ్యాపకులకు ఉన్న పేటెంట్ హక్కులను మరింత విస్తృతం చేసుకోవాలని సూచించారు. బోధన, పరిశోధనరంగాలలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రెక్టార్ ప్రొఫెసర్ రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ సిద్దయ్య, ఈ.శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ జాన్సన్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.రామచంద్రన్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి. రవికుమార్, కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఎం.సుబ్బారావు, ఎన్వీ కృష్ణారావు, డాక్టర్ బ్రహ్మాజీరావు, డాక్టర్ దివ్యతేజమూర్తి, డాక్టర్ కృష్ణసత్య, ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, డాక్టర్ పి.రవి, ప్రొఫెసర్ సంధ్యకోల్, డాక్టర్ గోపీకృష్ణ తదితరులు మాట్లాడారు.

జిల్లాకు 95 ఆర్టీసీ కొత్త బస్సులు

● కూటమి ప్రభుత్వం రాకతో కొత్తగా ప్రతిపాదనలు
● త్వరలోనే అందుబాటులోకి..

గుంటూరు, ఆగస్టు 9: విభజిత గుంటూరు జిల్లాకు 95 కొత్త ఆర్టీసీ బస్సులు సమకూరనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆర్టీసీలో కొత్త బస్సుల ప్రతిపాదనలు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 800 బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇటీవల రోడ్డు రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాకు కూడా కొత్త బస్సులు అందుబాటులోకి రానున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. కాగా కొత్త బస్సుల్లో 47 అద్దె బస్సులు కాగా మరో 48 బస్సులు ఆర్టీసీ సంస్థకి సంబంధించిన సర్వీసులుగా పేర్కొన్నారు. 25 పల్లెవెలుగు సర్వీసులు, 14 సూపర్ లగ్జరీలు, 9 అల్ట్రాడీలక్స్, మరో 47 ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే అద్దె బస్సుల ప్రతిపాదనలతో పాటు ఆర్టీసీ సంస్థ సొంతంగా కొత్త బస్సులు సమకూర్చునేలా ఏర్పాట్లుచేస్తోంది. ఇటీవలనే గుంటూరు నుంచి హైదరాబాద్‌కు రెండు బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కాగా విభజిత గుంటూరు జిల్లాలో మొత్తం బస్సులు 500 లోపుగా ఉన్నట్లు చెబుతున్నారు. వీటిల్లో అత్యధిక శాతం డొక్కు బస్సులే. అధ్వానపు బస్సులతోనే నెట్టుకొస్తున్నారు.

మొరాయిస్తున్న బస్సులు....

అత్యధిక శాతం కాలంచెల్లిన బస్సులు ఉండటంతో మార్గమధ్యంలో మొరాయిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో ఏ ఒక్క బస్సునూ సమకూర్చకపోవటంతోనే ఈ సమస్యలు ఎదురవుతున్నాయని ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులే చెబుతున్నారు. అంతేగాక గ్యారేజ్‌ల్లోనూ బస్సుల నిర్వహణ కూడా కష్టతరంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు అధ్వానపు రహదారులు కూడా బస్సులను గుల్ల చేస్తున్నాయని డ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆర్టీసీ అభివృద్ధిపై దృష్టి పెట్టటంతో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

● పోటీల్లో పాల్గొననున్న 26 పురుషులు, మహిళా జట్లు

వినుకొండటౌన్, ఆగస్టు 9: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోగల గుడ్ షఫర్డ్ పాఠశాలలో ఈనెల 10 నుంచి సోమవారం వరకు (10, 11, 12 తేదీలలో) రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి, 13 పురుషుల జట్లు, 13 మహిళా జట్లు పాల్గొంటాయన్నారు. పోటీల్లో భాగంగా క్రీడాకారులకు పాఠశాల డైరెక్టర్, డాక్టర్ ఇన్నారెడ్డి చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆదేవిధంగా క్రీడాకారులకు మూడు రోజుల పాటు అవసరమైన వసతి, ఆహార సౌకర్యం ఏర్పాటుచేస్తున్న డాక్టర్ ఇన్నారెడ్డికి ఆర్గనైజింగ్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

11న రాష్ట్రస్థాయి సిలంబం కర్రసాము పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9: సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ నెల 11 తేదీన రాష్ట్రస్థాయి సిలంబం కర్రసాము పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిష్టఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సెప్టెంబరులో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు అదే రోజున స్టేడియంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


18న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 9: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచిప్రెస్ పోటీలు ఈ నెల 18వ తేదీన తెనాలిలో జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఘట్టమనేని సాయిరేవతి, క్వీక్‌జిమ్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 8 గంటలకు శరీర బరువు చూడడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనదలచిన వారు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు. వివరాలకు సెల్: 9346307979, 9700844497 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాగార్జున సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు





నిండుకుండలా మారిన పులిచింతల ప్రాజెక్టు

మాచర్ల రూరల్, ఆగస్టు 9: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం నీటిని విడుదల చేశారు. 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 4గేట్లను 10అడుగుల మేర ఎత్తి 2,30,504 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8680 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367, 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 2,30,504, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,78,380 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,11,491 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తుండడంతో తిలకించేందుకు పర్యాటకులు శుక్రవారం విజయపురిసౌత్‌కు పోటెత్తారు. రహదారులు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు.

42 టీఎంసీలకు చేరిన నదీ జలాలు

● వరదతో పోటెత్తిన పులిచింతల

అచ్చంపేట, ఆగస్టు 9: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు వద్ద వరదనీరు పోటెత్తటంతో 11 గేట్ల ద్వారా కృష్ణా జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి 2,30,244 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నుంచి 2,42,355 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతోంది. 12వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా నదికి చేరుతోంది. ఆరు గేట్లను 2.50 మీటర్లు, మరో ఐదు గేట్లు మూడు మీటర్లు ఎత్తి కృష్ణాజలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో కృష్ణానదికి వరదనీరు పోటెత్తటంతో మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. ప్రయాణికులను దాట వేసే పడవలు కూడా పూర్తిస్థాయిలో నిలిచి పోయాయి.

తగ్గుముఖం పట్టిన వరద

● ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల ప్రజలు

వరద నీటిలో నానుతున్న ఇటుక బట్టీలు





వరద నీటి బారినపడిన అరటి తోట

పోతార్లంక చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు



కొల్లూరు, ఆగస్టు 9: కృష్ణానదికి వరద తగ్గుముఖం పట్టింది. గత కొద్దిరోజులుగా వరద విపత్తుపై అధికారుల హడావుడితో భయాందోళనలకు గురైన లంక గ్రామాల ప్రజలు వరద ముంపు తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం వరద గంటగంటకు తగ్గుతోంది. అయితే గురువారం సాయంత్రం వరద ఉధృతి వల్ల చిన్నరేవులో నుంచి ప్రవహించిన నీరు పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాలను ముంచెత్తుతూ దోనేపూడి వద్ద పోతార్లంక చప్టాపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో అక్కడ కొన్ని గంటలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అక్కడ కూడా చప్టాపై వరదనీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. అక్కడక్కడ పల్లపు ప్రాంతాల్లోని అరటి, అపరాలు, కూరగాయలు, పశుగ్రాసాల్లోకి వరద నీరు భారీగా చేరింది. దీని వల్ల ఆయా పంటలు స్వల్పంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. చిన్నరేవు వెంబడి ఉన్న ఇటుక బట్టీలు వరదనీటి ముంపునకు గురయ్యాయి. పెసర్లంక అరవింద వారధి గండి వద్ద పోసిన కట్ట వరద ఉధృతికి తట్టుకుని నిలవడంతో ఆ ప్రాంతంలోని పంట పొలాలు, ఇటుక బట్టీల్లో నీరు చేరలేదు. కొంత సీపేజ్ వల్ల అక్కడ వరద నీరు స్వల్పంగా వచ్చినప్పటికీ ఆ గ్రామ సర్పంచ్ వెలివెల బసవరత్తయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ యంత్రాల సహాయంతో కట్టను పటిష్టపరుస్తూ చర్యలు తీసుకోవడంతో ఆ ప్రాంతంలో వరదనీరు చేరలేదు.

గణపవరంలో మహిళ హత్య



హత్యా స్థలంలో వివరాలు నమోదు చేసుకుంటున్న రూరల్ సీఐ సుబ్బ నాయుడు

నాదెండ్ల, ఆగస్టు 9: మండలంలోని గణపవరం గ్రామంలో షేక్ మస్తాన్‌బీ(45) అనే మహిళ హత్యకు గురైంది. ఈ ఘటన శుక్రవారం గ్రామంలో సంచలనం కలిగించింది. హత్య గావించబడ్డ మస్తాన్‌బీకి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త నాగూర్ సాహెబ్ మూడు నెలల క్రితం మృతి చెందాడు. సొంత ఇల్లు లేక పోవటంతో మస్తాన్‌బీ శివాలయం వీధిలోని వాటర్ ప్లాంట్ సమీపంలో గల పీర్ల చావిడికి చెందిన ఒక గదిలో నివాసం ఉంటున్నది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మాలిక్‌రాజు అనే వ్యక్తి మూడు సంవత్సరాలుగా రాజీవ్‌గాంధీ కాలనీలో ఉంటున్నాడు. ఇటీవల అతని ఇంటి యజమానులు అతన్ని ఖాళీ చేయించారు. ఒక మేస్త్రీ ద్వారా తాత్కాలికంగా పీర్ల చావిడికి చెందిన రెండవ గదిలో ఉంటున్నాడు. అతనికి గది ఇవ్వటాన్ని స్థానికులు కొందరు వ్యతిరేకించారు. రెండు గదులకు మధ్య చిన్న గోడ మాత్రమే ఉంది. గ్రామంలో నివాసం ఉంటున్న మస్తాన్‌బీ చిన్న కుమార్తె జాన్‌బీ ఉదయం తల్లికి టీ ఇచ్చేందుకు పీర్ల చావిడి గదికి వచ్చిచూడగా తల్లి విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించింది. కాళ్ళు చేతులు కట్టి వేసి దుస్తులు మెడకు బిగించి ఆమెను హత్య చేశారు. పక్క గదిలో ఉంటున్న మాలిక్‌రాజు పరారీలో ఉన్నాడు. మాలిక్‌రాజు ఆమెను అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించటంతో హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ బాల రామిరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను గ్రామానికి రప్పించగా జాతీయరహదారి సమీపంలోని ఒక మిల్లు వరకు వచ్చి కుక్క నిలిచిపోయింది. సీఐ సుబ్బ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జడ్పీ హైస్కూలు అభివృద్ధికి రూ.30 లక్షల వితరణ

● ఎన్ఆర్ఐ సోదరుల దాతృత్వం ● తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రార్థన మందిరం నిర్మాణం



గ్రామస్తులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ సోదరులు

వట్టిచెరుకూరు, ఆగస్టు 9: తమ తండ్రి విధులు నిర్వహించి, తమకు విద్యాబుద్ధులు నేర్పి, శిఖరాలకు చేరువ చేసిన పాఠశాల అభివృద్ధికి తాము చేయూత నివ్వడం ఎంతో సంతోషాన్నిస్తుందని ఎన్ఆర్ఐ సోదరులు త్రిపురనేని ప్రభాకరరావు, రవికుమార్, భాస్కరరావులు తెలిపారు. శుక్రవారం వారు మండలం పరిధిలోని గారపాడు గ్రామం బొమ్మిడాల కోటిరత్నం జడ్పీ హైస్కూలును ప్రముఖ పారిశ్రామికవేత్త బోసురెడ్డితో కలిసి సందర్శించారు. తమ తండ్రి త్రిపురనేని సాంబశివరావు, తల్లి లక్ష్మీకాంతమ్మల జ్ఞాపకార్థం పాఠశాలలో ప్రార్థన మందిరం నిర్మాణానికి రూ.30లక్షల విరాళాన్ని అందజేస్తున్నట్లు ఎన్ఆర్ఐ సోదరులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తండ్రి త్రిపురనేని సాంబశివరావు 1962 నుంచి 1968 వరకు ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించారన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న తాము, సోదరి బుజ్జి అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి అమెరికా వెళ్ళి వైద్యవృత్తిలో స్థిరపడ్డామన్నారు. గతంలో జీజీహెచ్ అభివృద్ధికి రూ.కోటి విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద, పూర్వ విద్యార్థి తాటి వీరయ్య, సర్పంచ్ భవనం సుబ్బారెడ్డి, మన్నవ ప్రసాదరావు, ఆరుమళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, రవాణ, రెవెన్యూ అధికారులు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగు చర్యలు తీసుకోవాలి

● రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9: నగరంలో ట్రాఫిక్ రద్దీ క్రమబద్ధీకరణకు నగరపాలక సంస్థ, ట్రాఫిక్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా రహదారులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్‌తో ఆమె కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ కూడళ్ళ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రముఖ వ్యాపార సంస్థల సీఎస్ఆర్ నిధుల ద్వారా ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. అనంతరం గుడ్ సమ్మరిటన్ చట్టంకు ఎంపికైన కె శ్రీనివాసరావు, అనిల్ కుమార్‌లకు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్‌లు ప్రసంశ పత్రాలు అందించారు. సమావేశంలో డీటీసీ షేక్ కరీం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎక్సైజ్ ఈఎస్ వెంకట్రామిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాష్, ఆర్ అండ్ బీ ఈఈ సమర్పణరావు, ట్రాఫిక్ డీఎస్పీ వివి నాయుడు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలి : కలెక్టర్

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీల కంప్యూటరైజేషన్ ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జరిగిన జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ పాల్గొన్నారు. సమావేశంలో ఏజెండాకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీ(పీఏసీ) కంప్యూటరైజన్‌తో పాటు సభ్యుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ బార్గవ్ తేజ మాట్లాడుతూ జిల్లాలోని 67 పీఏసీలలో 52 పీఏసీల కంప్యూటరైజేషన్ పూర్తి అయ్యిందన్నారు. మిగిలినవి త్వరలోనే పూర్తి చేయటం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, జిల్లా పంచాయితీ అధికారి శ్రీదేవి, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా మత్స్య శాఖ అధికారి గాలి దేముడు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని అడవితక్కెళ్లపాడు ఎస్టీ గురుకుల పాఠశాలను శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ మధ్యలో వర్షపు నీరు నిలబడి ఏపుగా పెరిగిన గడ్డిని చూసి నీరు నిలబడకుండా లెవలింగ్ పనులు చేపట్టేందుకు అవసరమైన ఎస్టిమేషన్‌ను సమర్పించాలని జీయంసీ పర్యవేక్షక ఇంజనీర్ శ్యామ్ సుందర్‌ను ఆదేశించారు. అనంతరం గురుకుల పాఠశాలలోని వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఆంగ్లంపై విద్యార్థులకు ఎంత పట్టు వుందో తెలుసుకునేందుకు వండిన భోజనం గురించి ఆంగ్లంలో వివరించమని విద్యార్థులను ఆదేశించారు. అయితే విద్యార్థులు అందుకు సరైన పద్ధతిలో ఆంగ్లంలో వివరించలేకపోయారు. విద్యార్థులు వారు తింటున్న పదార్థాలను ఇంగ్లిషులో వివరించలేకపోవడం చూసి ఉపాధ్యాయులపై కలెక్టర్ అసహనాన్ని వ్యక్తపరిచారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో మంచి తర్ఫీదును అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో పి.శ్రీకర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి శిరీష, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ ఫణీంద్ర, ప్రిన్సిపల్ బాబ్లూ నాయక్, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అనిల్ కుమారి, జీయంసీ డివిజనల్ ఇంజనీర్ హనీఫ్, కార్పొరేటర్ స్మిత పద్మజ పాల్గొన్నారు.

పని వేళల్లో సచివాలయ కార్యదర్శులు ఉండాలి

● కార్యదర్శుల పనితీరుపై హరికృష్ణ ఆగ్రహం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 9 : నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) సూర్యదేవర హరికృష్ణ స్పష్టం చేశారు. కమిషనర్ శుక్రవారం సంపత్‌నగర్‌లోని 59, 60, 61, 62, 67, 68 వార్డు సచివాలయాలను డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శుల హాజరు సక్రమంగా లేకపోవడం, పని వేళల్లో మూమెంట్ రిజిస్టర్‌లో నోట్ చేయకుండా వెళ్లడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి వార్డు సచివాలయాలు ఆకస్మిక తనిఖీ చేస్తామన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సచివాలయంలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండి, ప్రజల నుంచి అందే ఆర్జీలను తీసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో ఇంటి, కుళాయి పన్నులను నూరుశాతం వసూలు చేయడంలో కార్యదర్శులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి కార్యదర్శి తమ విభాగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

శాటిలైట్ లాంచింగ్ అద్భుత ప్రక్రియ

● ఇస్రోమాజీ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్



మాట్లాడుతున్న ఎంవైఎస్ ప్రసాద్

గుంటూరు(విద్య),ఆగస్టు 9: శాటిలైట్ లాంచింగ్ అనేది అద్భుతమైన ప్రక్రియ అని ఇస్రో మాజీ డైరెక్టర్ పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాటిలైట్ వల్ల ప్రజలకు మెరుగైన సాంకేతిక సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. పీఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి శాటిలైట్స్ గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ఆచార్య పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

● బాధ్యతలు స్వీకరించిన కొత్తపేట సీఐ వీరయ్య



గుంటూరు, ఆగస్టు 9 : కొత్తపేట సీఐగా నియమితులైన ఎం.వీరయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ తో పాటు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అనంతరం ఆయన రేంజ్ ఐజి త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను, ఇతర అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

గంజాయి, డ్రగ్స్ పై ప్రత్యేక దృష్టి

● బాధ్యతలు స్వీకరించిన లాలాపేట సీఐ శివప్రసాద్



గుంటూరు, ఆగస్టు 9 : లాలాపేట సీఐగా అడుసుమల్లి వెంకట శివప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి డ్రగ్స్ అక్రమ రవాణా వినియోగం పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా పట్నంబజార్ లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు వ్యాపారులు పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు. అనంతరం ఆయన రేంజ్ ఐజి త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను, ఇతర అధికారులను మర్యాదపూర్వకంగా కలవగా స్టేషన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై ఆయా అధికారులు ఆయనకు పలు సూచనలు చేసారు.

సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు

● డీఈవో శైలజ

గుంటూరు(విద్య),ఆగస్టు 9: జిల్లాలో అన్ని యాజమాన్యాలు తప్పని సరిగా ఈనెల 10, 11 తేదీల్లో స్కూల్‌కు సెలవు ఇవ్వాలని ఎక్కడైనా పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో పిశైలజ స్పష్టం చేశారు. అనేక ప్రైవేటు యాజమాన్యాలు ఇప్పటికే సెలవులు ఇవ్వకుండా పాఠశాలలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సదరు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యం : కలెక్టర్



గిరిజన నేతలకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి

గుంటూరు సిటీ, ఆగస్టు 9 : ఆదివాసీలు తమ పిల్లలను విద్యావంతులను చేయడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని, వారి అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బి రామాంజనేయులు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి సేవాలాల్ మహారాజ్, ఏకలవ్య, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, చెంచు లక్ష్మీ, వెన్నెలగంటి రాఘవయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి సభను ప్రారంభించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ జాతి అభివృద్ధి కోసం కొన్ని వదులుకోవలసి వస్తుందని, ప్రతి ఒక్కరూ కష్టపడే మనసత్వం కలిగి వుండాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతిని పరిరక్షించుకోవడానికి ఆదివాసీల దినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి శిరీష, బీసీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి, యానాది సేవా డెవలప్మెంట్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బాపట్ల ఏసుబాబు, మార్కెటింగ్ ఉద్యోగుల ఎస్టీ సెల్ నాయకుడు అమాష్ రాములు, ఏపీ ఏకలవ్య సేవ సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, అఖిల భారత ఏకలవ్య సేవా సంఘం అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు, ఎరుకుల సేవా సంఘం అధ్యక్షులు దేవరకొండ శంకరరావు, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవదాయి చంద్రనాయక్, ఏపీ చెంచు సేవా పథకం అధ్యక్షుడు పసుపులేటి వరప్రసాద్, ఏపీ సేవాలాల్ యువ సేన అధ్యక్షుడు భాగవత్ చంద్రశేఖర్ నాయక్, వివిధ గిరిజన, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నాజ్ సెంటర్ వద్ద ఏకలవ్య, అల్లూరి సీతారామరాజు, వెన్నలగంటి రాఘవయ్య విగ్రహాలకు శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్‌తో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ నాగలక్ష్మి మీడియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని జిల్లాలో మూడు రెసిడెన్షియల్ స్కూళ్ళు, నాలుగు హాస్టళ్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గిరిజనులు ప్రదర్శించిన కర్రసాము ప్రదర్శనను కలెక్టర్ ఆసక్తిగా తిలకించి సాంస్కృతిక ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి శిరీష, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ నగేష్, జిల్లా న్యూక్లియస్ అధికారి డాక్టర్ లక్ష్మా నాయక్, డీడీ హార్టీ కల్చర్ రవీంద్ర, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవదాయి చంద్ర నాయక్, ఏ. పి చెంచు సేవా పథకం అధ్యక్షులు పసుపులేటి వరప్రసాద్ ఏ.పి. సేవాలాల్ యువ సేన అధ్యక్షులు భాగవత్ చంద్ర శేఖర్ నాయక్ వివిధ గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు..



పెమ్మసానిని శాలువాతో సత్కరిస్తున్న సంఘం నాయకులు కేసన, క్రాంతికుమార్ తదితరులు

స్కిల్ డెవలప్‌మెంట్‌లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

● కేంద్రమంత్రి పెమ్మసానికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టనున్న స్కిల్ డెవలప్‌మెంట్‌లో బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కేంద్ర గ్రామీణ, స్కిల్ డెవలప్‌మెంట్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్‌లు విజ్ఞప్తి చేశారు. డిల్లీలో కేంద్ర మంత్రి ఛాంబర్‌లో సంఘం నాయకులు ప్రత్యేకంగా కలుసుకున్నారు. స్కిల్ డవలప్‌మెంట్‌లో బీసీల ఎదుగుదల వారికి రావాల్సిన ఫండ్స్, హక్కుల గురించి ప్రస్తావించినట్లు తెలిపారు. స్కిల్ డవలప్‌మెంట్‌లో బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కిరణ్ గారు, పూర్ణ చంద్ర, వైజాగ్ శ్రీనివాస్, పళ్ళ రమణ, రవి తదితరులున్నారు.

పోలీసుల పేరుతో వస్త్ర వ్యాపారికి విలేకరుల బెదిరింపు

● కొత్తపేట స్టేషన్‌లో వ్యాపారి ఫిర్యాదు

గుంటూరు, ఆగస్టు 9 : పోలీసుల పేరు చెప్పి ఆన్‌లైన్ వస్త్ర వ్యాపారిని బెదిరించి డబ్బు వసూలు చేసిన విలేఖరుల వ్యవహారం కలకలం రేపుతోంది. తనను బెదిరించి డబ్బు వసూలు చేసింది పోలీసులు కాదు, విలేఖరులని తెలుసుకున్న సదరు వ్యాపారి కొత్తపేట పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట స్టేషన్ పరిధిలోని శీలంవారి వీధికి చెందిన కొండారెడ్డి వస్త్రాలు కొనుగోలు చేసి కొంత మార్జిన్ చూసుకుని ఆన్‌లైన్‌లో అమ్ముకుంటుంటాడు. ఇందుకు ఎటువంటి లైసెన్స్ అవసరం లేదు. అయితే ఈ విషయం తెలుసుకున్న ఓ ఛానల్ విలేకరులు ఆ వ్యాపారిని బెదిరించి డబ్బు వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం కొండారెడ్డిని సంప్రదించారు. అనుమతి లేకుండా ఆన్‌లైన్ వస్త్ర వ్యాపారం చేస్తున్నావంటూ తాము కొత్తపేట పోలీసులమని బెదిరించారు. తమను సీఐ పంపారని, రూ.లక్షన్నర ఇవ్వాలని, లేదంటే సీఐ స్టేషన్‌కు తీసుకురమ్మన్నారని భయపెట్టారు. దీంతో భయపడిన వ్యాపారి లక్షా 20 వేలు ముట్టచెప్పుకున్నాడు. అంతటితో ఆగని విలేఖరులు తాము ముందు డిమాండ్ చేసినట్లుగా మరో రూ.30 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో అనుమానం వచ్చిన సదరు వ్యాపారి కొండారెడ్డి కొత్తపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. దీంతో ఇప్పటి వరకు సీఐగా ఉన్న అన్వర్ బాషా వారిద్దరినీ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే ఆయన బదిలీ అయ్యారు. దీంతో సీఐ వీరయ్య శుక్రవారం మరోసారి సదరు వ్యాపారి కొండారెడ్డిని, ఇరువురు విలేఖరులు కిరణ్, సాంబశివరావులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9 : స్థానిక అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మి మందిరంలో ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాదు ఆధ్వర్యంలో శ్రావణమాస విశేష పూజలు ప్రారంభమైన క్రమంలో తొలి శుక్రవారం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో ప్రతి రోజు సాయంత్రం లలిత సహస్రనామ పారాయణలు, విశేష కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. విశేష హారతులు, మంత్రపుష్పం అనంతరం భక్తులకు, పూజలలో పాల్గొన్న వారికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. స్థానిక సిద్దార్థనగర్ శ్రీ కనకమహాలక్ష్మి మందిరంలో అమ్మవారికి అనేక రకాల పుష్పాలతో అలంకరించి శ్రావణ శుక్రవారవ్రతాన్ని నిర్వహించారు. మహిళలు వ్రతంలో పాల్గొని మహా హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.



శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

● గుంటూరు, ఆగస్టు 9: శ్రావణ మాసం అందునా తొలి శుక్రవారం కావటంతో ఆలయాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. పలు ప్రధాన ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏటుకూరు రోడ్డులోనున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారికి విశేష పూలతో అలంకరించి పూజలు చేశారు. పొన్నూరు రోడ్డు సంగడిగుంట వద్దనున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మోరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ అరవ అంజనేయులు భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సంపత్‌నగర్‌లోని శారదాపీఠంలోనూ అమ్మవారికి విశేష పూజాలంకరణలు చేశారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నగర రోడ్లు

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి సజీవ సాక్షాలుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రోడ్లు ఉన్నాయని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. నియోజకవర్గంలోని పలు బీటీ రోడ్లకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. 73 లక్షల రూపాయల అంచనాలతో 33వ డివిజన్లోని పండరీపురం మెయిన్ రోడ్డు, రూ.55 లక్షల అంచనాలతో 580 మీటర్ల రోడ్డు, 43వ డివిజన్లో 55 లక్షల రూపాయల అంచనాలతో 350 మీటర్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, పోపూరి నరేంద్ర, ఈరంటీ వర ప్రసాద్, కొల్లి అనిల్, చెరుకూరి తిరుపతిరావు, ఆళ్ల హరి, శివా, కొణికి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న గళ్లా మాధవి

జూట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

జూట్ మిల్లు కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, వారికి అండగా ఉంటానని మాధవి హామీ ఇచ్చారు. జూట్ మిల్లు వద్ద టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న మహాధర్నాకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్తలు వివిధ కారణాలతో ఈ జూట్ మిల్లును మూసివేశారని, అనేక సంవత్సరాలు పని చేసిన కార్మికులకు యాజమాన్యం నుంచి రావలసిన బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వారిని పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి అండగా నిలుస్తానని మాధవి హామీనిచ్చారు. కార్యక్రమంలో గుంటుపల్లి శేషగిరిరావు, మదమంచి శ్రీను, బండారు వెంకటేశ్వరావు, ప్రభుదాస్, గంటా పెద్దబ్బాయి, యడ్లూరి నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 14 మంది ఎస్‌ఐల బదిలీ

గుంటూరు, ఆగస్టు 9 : జిల్లాలో 14 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐలు వివరాలు ఇలా ఉన్నాయి. అటాచ్‌మెంట్‌పై ఉన్న మంగళగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వెంకటేశ్వర్లును అక్కడే నియమించారు. అలాగే అటాచ్‌మెంట్‌పై ఉన్న దుగ్గిరాల ఎస్సై వెంకటరవిని కూడా అదే స్టేషన్‌లో నియమించారు. ప్రత్తిపాడు స్టేషన్లో అటాచ్‌మెంట్‌పై ఉన్న కే నాగేంద్రను కూడా అదే స్టేషన్లో నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కాకుమాను ఎస్‌ఐ ఎస్.రవీంద్రను వీఆర్‌కు పంపారు. పట్టాభిపురం ఎస్‌ఐ పృధ్వీ ఏక్‌నాథ్‌ను కాకుమాను ఎస్సైగా నియమించారు. చేబ్రోలు ఎస్‌హెచ్‌వో మహేష్ కుమార్‌ను విఆర్ కు పంపారు. వీఆర్‌లో ఉన్న డి వెంకట కృష్ణను చేబ్రోలు ఎస్‌హెచ్‌ఓ గా నియమించారు. విఆర్‌లో ఉన్న ఎస్‌ఐ పి సుబ్బారావును అరండల్‌పేట ఎస్‌ఐగా నియమించారు. అరండల్‌పేట ఎస్‌ఐ టి నాగరాజును నల్లపాడుకు బదిలీ చేశారు. మేడికొండూరు ఎస్సై చల్లా వాసును నల్లపాడుకు బదిలీ చేశారు. అదేవిధంగా ఫిరంగిపురం ఎస్సై పి వీరనారాయణను కూడా నల్లపాడుకు బదిలీ చేశారు. నల్లపాడు ఎస్‌ఐలు కే ఏడుకొండలు, వై సత్యనారాయణ, జాజం శ్రీనివాసరావులను విఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద),ఆగస్టు 9: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. కళాశాల అభివృద్ధి కోసం ఇటీవల ప్రభుత్వం రూ.24 లక్షలు మంజూరు చేసిందన్నారు. అదే విధంగా ఇక్కడ నెలకొన్న డ్రైనేజి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.సునీత, వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు అధ్యాపకులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలకు వెళ్లిన 40 మంది ఎంపీడీవోలు

గుంటూరు సిటీ, ఆగస్టు 9 : ఎన్నికల విధుల నిమిత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా కు వచ్చిన ఎంపీడీఓలు స్వంత జిల్లాలకు వెళ్లిపోయారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ సీఈఓ ఎన్ ఎస్ వి బి వసంతారాయుడు ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 40 మంది ఎంపీడీఓలను రిలీవ్ చేశారు. ఆయా అధికారులు వెంటనే వారి జిల్లాకు వెళ్లి విధుల్లో జాయిన్ కావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని సినీనటుడు పృథ్వీరాజ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. - గుంటూరు.

వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్లు జగన్ తీరు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ



గుంటూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్లుగా వైసీపీ నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవహారశైలి ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. ఆ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల పాపాలకు ప్రాయశ్చిత్తంగా ఇప్పుడు జనంలోకి వస్తూ పరామర్శల పేరుతో శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో ఓట్లతో జనం వాతలు పెడితేగానీ ఆయనకు ప్రజలు గుర్తుకు రాలేదని, నాడు సొంత ఎమ్మెల్యేలనే పట్టించుకోని వ్యక్తి నేడు రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే అమలు చేస్తోన్న పథకాలు చూసి ఓర్వలేక అక్కసుతోనే జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మోహనకృష్ణ దుయ్యబట్టారు. ప్రజలు తన అవినీతి, అసమర్థ పాలనకు ఘోరీకట్టారన్న అసూయతో చంద్రబాబు, కూటమి ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్న జగన్‌కు ఏమాత్రం దమ్ము ధైర్యం ఉన్నా... ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలపై అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.

చంద్రబాబు పాలనను దేవుడు దీవించాడు

● జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, ఆగస్టు 9 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనను దేవుడు దీవించాడని, నదులన్నీ జలకళతో ఉట్టిపడుతున్నాయని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. గత మూడేళ్లుగా జలాశయాలు అడుగంటి నీరు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో చంద్రబాబు పాలనను దేవుడు దీవించి అన్ని ప్రాజెక్టులు నిండి జలకలతో ఉట్టిపడుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాగు, తాగు నీరుకు ఇబ్బంది లేదన్నారు. ఇటీవల చంద్రబాబు నాయుడు సారధ్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజా ఆమోదంగా ఉన్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం పోయిందని అసూయతో ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఏనాడో తిరస్కరించారు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.



పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న అనుమానాస్పద వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కొత్తకాలనీలో కార్డన్ సెర్చ్

● సరైన పత్రాలు లేని 18 ద్విచక్రవాహనాల సీజ్

● స్వయంగా తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 9: స్థానిక మిర్చి యార్డు సమీపంలోని కొత్తకాలనీ, లక్ష్మీనగర్‌లను శుక్రవారం వేకువజామునే చుట్టుముట్టిన పోలీసులు కార్డన్‌సెర్చ్ చేశారు. తెల్లవారక ముందే పెద్ద సంఖ్యలో పోలీసులు కాలనీని చుట్టుముట్టడంతో ఏమి జరిగిందో అర్థం కాక కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. సమారు 150 మంది పోలీసులు ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాలనీ మొత్తం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాత నేరస్తులు తిరిగి ఏదైనా నేరానికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడబోమన్నారు. కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని, అనుమానాస్పద స్థితిలో ఉన్న 18 వాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

తాలూకా కాంపౌండ్‌లో ఉన్న జిల్లా జైలులో ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి రఘుని జైలు నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల్లో ముద్దాయిల వివరాలను రోస్టర్‌లో ఎంట్రీ చేయడం, వివిధ రికార్డుల గురించి అడిగి తెలుసుకుని వాటిని పరిశీలించారు. అనంతరం జిల్లా జైలు పరిసర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. రిమాండ్ నిందితుల ఎస్కార్ట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కి సూచించారు. రిమాండ్‌లో ఉన్న రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. జైలు నుంచి విడుదలైన ఖైదీల జాబితా వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆనంద్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐసీటీఈ
ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధృవీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్‌ఓ/ఎస్ఎన్‌ఓ/ఎంఎన్‌ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌టీయూ హెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/GABEQtfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్స్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్ వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు సలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.

కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ బోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా రైడ్‌కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే. మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.



సూర్యకు స్వల్ప గాయం



తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్ళీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

కొత్తగా..

నిరీక్షణకు తెర

'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురు చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని
తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత్త.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.

ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్వి రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.



రోగులకు మందులు అందిస్తున్న న్యాయాధికారి

ఆరోగ్య పరిరక్షణపై అవగాహనతో ఉండాలి

● న్యాయాధికారి రాజశేఖర్

తెనాలి క్రైం, ఆగస్టు 9: ఆరోగ్య పరిరక్షణపై అవగాహన లోపిస్తే ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముడతాయని పేదలు ఆరోగ్య సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక యడ్ల లింగయ్య కాలనీలో శుక్రవారం తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు ఆదేశంతో ప్రత్యేక వైద్య శిబిరం, న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో న్యాయాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ పేదవర్గాలు అనారోగ్యం పాలు కాకుండా ఉండటానికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. పేద వర్గాలకు న్యాయపరమైన సేవలు అందించడానికి మండల న్యాయసేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని, దీనిద్వారా న్యాయసేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, డాక్టర్ దేవికారాణి సీజనల్ వ్యాధులు, రక్తహీనత, పౌష్టికాహారం గురించి కాలనీ వాసులకు వివరించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైనటువంటి రోగులకు ఉచితంగా మందులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనీల్‌కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

శాటిలైట్ లాంచింగ్ అద్భుత ప్రక్రియ

● ఇస్రో మాజీ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్

గుంటూరు (విద్య), ఆగస్టు 9: శాటిలైట్ లాంచింగ్ అనేది అద్భుతమైన ప్రక్రియ అని ఇస్రో మాజీ డైరెక్టర్ పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాటిలైట్ వల్ల ప్రజలకు మెరుగైన సాంకేతిక సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఇందులో ఎంతోమంది భాగస్వాములుగా ఉంటారని అనేక శాస్త్రవేత్తల సమష్టికృషితోనే శాటిలైట్ ప్రయోగాలు విజయవంతం అవుతాయని చెప్పారు. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ శాటిలైట్స్ గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ఆచార్య పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవైఎస్ ప్రసాద్



బుర్రిపాలెంలో వైద్యశిబిరంలో పాల్గొన్న ఆంధ్ర హస్పటల్ వైద్యులు, సిబ్బంది

బుర్రిపాలెంలో హెల్త్ క్యాంపు

తెనాలి రూరల్, ఆగస్టు 9: సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినంను పురస్కరించుకుని ఆయన దత్తతగ్రామం బుర్రిపాలెంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. శుక్రవారం విజయవాడ ఆంధ్ర హస్పటల్ వారు గ్రామంలోని అనారోగ్య సమస్యలతో ఉన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఆంధ్ర హస్పటల్స్ డైరెక్టర్, పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పీవీ రామారావు పర్యవేక్షణలో జరిగిన హెల్త్ క్యాంపులో పలు విభాగాల వైద్యులు డాక్టర్ సయ్యద్ ముదసిర్, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ అమర్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గరుడ పంచమి వేడుకలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 9: శ్రావణమాస పంచమి పర్వదినాన్ని శుక్రవారం గరుడ పంచమి పర్వదినంగా నిర్వహించారు. పట్టణంలోని సహస్ర లింగేశ్వరస్వామి, వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన ఏకశిల గరుత్మంత స్వామికి గరుడ పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 అడుగుల ఎత్తైన గరుత్మంత విగ్రహానికి వేకువ జాము నుంచే జలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు జరిగాయి. ఈ అభిషేకాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాలను వీక్షించారు. అలాగే మండల పరిధిలోని కట్టెంపూడి శ్రీ నాగేంద్రస్వామి పుట్ట వద్ద పంచమి వేడుకలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాలు జరిపారు.కార్యక్రమంలో ఆయా ఆలయాల నిర్వాహకులు, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.



ప్రత్యేక పూజలందుకున్న గరుత్మంత స్వామి

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని నిరసన

తెనాలి అర్బన్, ఆగస్టు 9: ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్గీకరణను వ్యతిరేకిస్తూ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతి పత్రం అందించారు. ఎస్సీ ఉప వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కనపర్తి అనీల్ మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పును పునః సమీక్షించాలన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని కూడా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అన్ని ఎస్సీ సంఘాలు విద్యార్థి, ఉద్యోగ సంఘాలు ఉద్యమానికి సన్నద్ధం కావాలని కోరారు. అశోక్‌కుమార్, ప్రభాకర్, కోటేశ్వరరావు, స్టాలిన్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.



బోనస్‌ను పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ అధికారులు, సంఘ సభ్యులు

రైతులు పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవాలి

● సంగం డెయిరీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

కొల్లిపర, ఆగస్టు 9: రైతులు పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవాలని సంగం డెయిరీ డైరెక్టర్ శాఖమూరి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చివలూరు పాలకేంద్రంలో బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి పాలకేంద్రం అధ్యక్షుడు నీలా మణిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను కూడా లాభసాటిగా మార్చుకోవాలన్నారు. ప్రతిరైతు తప్పనిసరిగా రెండు గేదెలను పెంచడంవలన ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. అనంతరం 93 మంది రైతులకు 3లక్షల 13వేల రూపాయలను బోనస్‌ను పంపిణీ చేశారు. అదే విధంగా మండల పరిధిలోని కొత్తబొమ్మువానిపాలెం పాలకేంద్రంలో 33మంది రైతులకు లక్షా 13వేలు, కొల్లిపర పాలకేంద్రంలో 108 మంది రైతులకు రూ.2లక్షల 52వేలను పాల సంఘ సభ్యులు, డెయిరీ అధికారులు బోనస్‌ను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాలకేంద్రం అధ్యక్షుడు నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు చినరామిరెడ్డి, సూపర్‌వైజర్ వెంకట్రావు, కార్యదర్శులు భీమవరపు శేషిరెడ్డి, బొమ్ము కోటిరెడ్డి, డెయిరీ అధికారులు సందీప్‌కృష్ణ, గరికపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

తెనాలి రూరల్, ఆగస్టు 9: ప్రభుత్వం గిరిజన సంక్షేమ గురుకుల హాస్టల్స్‌లో ఉండి విద్యనభ్యసించే విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల స్కూల్, హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న బోధన, భోజనం, వసతులు వంటివాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు బోధిస్తున్న ఆన్‌లైన్ క్లాసులను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా అన్నింటికీ సమాధానం చెప్పారు. హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పగా అంతాబాగానే ఉన్నాయని విద్యార్థులు బదులివ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ఇక్కడ టీచర్స్ కొరత ఉన్నట్లు తెలిసిందన్నారు. త్వరలోనే నియమించడం జరుగుతుందన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని దీనిని మరమ్మతులు చేయించడం జరుగుతుందన్నారు. వర్షాలు కురిస్తే నీరు ఆవరణలో చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. హాస్టల్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అన్ని వసతులతో మంచి విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తనిఖీలలో సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, తహసీల్దార్ గోపాలకృష్ణ, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రభుత్వ కార్పొరేట్ విధానాలపై నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

తెనాలి అర్బన్, ఆగస్టు 9: కేంద్రం ప్రభుత్వం కార్పొరేట్ విధానాలను విడనాడాలని సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆలిండియా కమిటీల పిలుపుమేరకు మున్సిపల్ కార్యాలయం నుంచి బోసురోడ్డు వరకు ర్యాలీ చేశారు. కార్పొరేషన్లకు ఊడిగం చేయవద్దని బ్యాంకుల బకాయిలు ఉన్న కంపెనీలపై చర్యలు చేపట్టాలని, కార్మిక, కర్షకుల కోసం పథకాలు ప్రవేశ పెట్టాలని, రైతు రుణాలు రద్దు చేసి ఆత్మహత్యలు నివారించాలన్నారు. ధరలు తగ్గించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. బ్యాంకింగ్ రంగం కార్పొరేట్లకు సబ్సిడీలు ఇస్తూ ఎగవేతదారులకు వేలకోట్లు మాఫీ చేయడం దారుణమన్నారు. కార్పొరేట్ టాక్స్ తగ్గంచడం వల్ల ఖజానా ఆదాయం భారీగా పడిపోయిందని చెప్పారు. స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించొద్దు

● ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించడం మానుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురంలో క్విట్ కార్పొరేట్ డే సందర్భంగా అఖిల భారత రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వామ పక్షాల పిలుపు మేరకు రైతు సంఘ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎరువులు మీద సబ్సిడీలు తగ్గించడం వలన రైతులపై భారం పడుతుందన్నారు. కార్పొరేట్‌లకు లక్షల కోట్లు సబ్సిడీలు ఇవ్వడం వలన రైతులను దెబ్బతీస్తుందన్నారు. రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టంకోసం రైతులు, కౌలు రైతులు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు వల్లభాపురం ధర్మయ్య అత్తోట వీరయ్య, సంసోన్, దేవరపల్లి అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



వల్లభాపురంలో క్విట్ కార్పొరేట్ డే సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

ఆడపిల్లల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఖలీల్

తెనాలి రూరల్, ఆగస్టు 9: ఆడపిల్లల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాయని, బాలలను, ఆడపిల్లలను ఎవరైనా అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నిస్తే 139, లేదా రైల్వేచైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా సమాచారం అందించి వారిని రక్షించేందుకు సహకరించాలని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ తెనాలి ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఖలీల్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని కోగంటి శివయ్య మునిసిపల్ హైస్కూల్‌లో రైల్వేచైల్డ్ హెల్ప్‌లైన్, రైల్వేప్రొటక్షన్ ఫోర్స్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఖలీల్ మాట్లాడుతూ ఆడపిల్లలు రైలులో ప్రయాణం చేసే సమయంలో అనుకోని ఇబ్బందులకు లోనైతే రైల్వేహెల్ప్‌లైన్ నెంబరు 139 లేదా చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన కొద్ది నిముషాల్లోనే అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. బాలల అక్రమ రవాణా రైల్వేద్వారా ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. వాటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంచేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులందరూ మంచి విద్యనభ్యసించడంతోపాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. స్కూల్ హెచ్ఎం కె.రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుంటూరు రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ టీమ్ మెంబర్ వాకా లక్ష్మీనందన్, ఐసీడీఎస్ వై.నాగమణి, ఏఎస్ఐ ఎం. శివరామకృష్ణయ్య, ఆర్‌పీ శివారెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ తెనాలి ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఖలీల్

జిల్లాలో 14 మంది ఎస్ఐల బదిలీ

గుంటూరు, ఆగస్టు 9: జిల్లాలో 14 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అటాచ్‌మెంట్‌పై ఉన్న మంగళగిరి రూరల్ ఎస్‌హెచ్ఓ ఎం వెంకటేశ్వర్లను అక్కడే నియమించారు. అలాగే అటాచ్‌మెంట్‌పై ఉన్న దుగ్గిరాల ఎస్ఐ వెంకటరవిని కూడా అదే స్టేషన్‌లో నియమించారు. ప్రత్తిపాడు స్టేషన్లో అటాచ్‌మెంట్‌పై ఉన్న కే నాగేంద్రను కూడా అదే స్టేషన్లో నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కాకుమాను ఎస్ఐ ఎస్ రవీంద్రను వీఆర్‌కు పంపారు .పట్టాభిపురం ఎస్ఐ పృథ్వీ ఏక్‌నాథ్‌ను కాకుమాను ఎస్ఐగా నియమించారు. చేబ్రోలు ఎస్‌హెచ్‌వో మహేష్‌కుమార్‌ను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న డి.వెంకటకృష్ణను చేబ్రోలు ఎస్‌హెచ్‌వోగా నియమించారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఐ పి సుబ్బారావును అరండల్‌పేట ఎస్ఐగా నియమించారు. అరండల్‌పేట ఎస్ఐ టి నాగరాజును నల్లపాడుకు బదిలీ చేశారు. మేడికొండూరు ఎస్ఐ చల్లా వాసును, ఫిరంగిపురం ఎస్ఐ పి వీరనారాయణను నల్లపాడుకు బదిలీ చేశారు. నల్లపాడు ఎస్ఐలు కే ఏడుకొండలు, వై సత్యనారాయణ, జాజం శ్రీనివాసరావులను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

మారీసుపేట శివాలయంలో కుంకుమార్చనలు

తెనాలి అర్బన్, ఆగస్టు 9: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మారీసుపేట శివాలయంలో కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో అర్చనల్లో పాల్గొన్నారు. అమ్మవారిని శ్రీలక్ష్మీగణపతి అలంకారం చేశారు. కమిటీ సభ్యులు, అర్చకులు పర్యవేక్షించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు టౌన్, ఆగస్టు 9: సెప్టెంబరు 14న స్థానిక సివిల్ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, సివిల్ జడ్జి ఎం.అంజనీప్రియదర్శిని శుక్రవారం కోరారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని కేసులను సంప్రదించి సత్వరన్యాయం పొందాలని మెజిస్ట్రేట్ అంజనీ ప్రియదర్శిని సూచించారు.

ఆదిశేషు ఆలయంలో నాగ పంచమి పూజలు

పెదకాకాని, ఆగస్టు 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వర దివ్య క్షేత్రంలోని ఆదిశేషు దేవాలయంలో నాగ పంచమి సందర్భంగా శుక్రవారం అభిషేకాలు, పూజలను ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు నిర్వహించారు.

దేవాలయాల్లో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

కొల్లిపర, ఆగస్టు 9: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, తూములూరు, హనుమాన్ పాలెం, దావులూరు, చివలూరు, అత్తోట, అన్నవరం దేవాలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు మహిళలతో సామూహికంగా వ్రతాన్ని చేయించారు.

ఆర్పీఎఫ్ సీఐ అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

తెనాలి క్రైం, ఆగస్టు 9: తెనాలి ఆర్పీఎఫ్ మహిళా హెడ్ కానిస్టేబుల్‌తో ఆర్పీఎఫ్ సీఐ అబ్దుల్ ఖలీల్ అసభ్య ప్రవర్తనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి శుక్రవారం వెల్లడించారు. ఎస్ఐ వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం తెనాలి రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) స్టేషన్‌లో మహిళా హెడ్ కానిస్టేబుల్‌గా ఎం.సుహాసిని విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 19న ఆమె విధుల్లో ఉన్న సమయంలో ఆ స్టేషన్ సీఐగా పని చేస్తున్న అబ్దుల్ ఖలీల్ ఆమెతో అసభ్య ప్రవర్తించి, అసభ్య పదజాలంతో వేధింపులకు గురి చేశాడు. ఈ సంఘటనపై శనివారం ఆర్‌పీఎఫ్ మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎం.సుహాసిని అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు వెంకటాద్రి తెలిపారు.

కొలకలూరులో గందరగోళంగా గ్రామసభ

తెనాలి రూరల్, ఆగస్టు 9: ఉన్న ఒక్క ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు అధికారపార్టీకి చెందిన ఇద్దరు వేరువేరు అభ్యర్థుల పేర్లు సిఫారసు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. శుక్రవారం మండలంలోని కొలకలూరులో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించాల్సిన సభను సచివాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా దీనిపై వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. పంచాయతీ వద్ద వైద్యసేవలు జరుగుతుండగా రోగులు వచ్చి ఉండటంతో దానిని సచివాలయంలోకి మార్చేలా చూడాలని గ్రామ కార్యాదర్శిని సర్పంచ్ కోరారు. అయితే డీపీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలోనే గ్రామ సభ జరగాలని ఆయన బదులిచ్చారు. వార్డు మెంబర్లు అందరూ కలిసి పంచాయతీ కార్యాలయంలో సభ జరిపేందుకు రిజిష్టర్లో సంతకాలు చేయగా పలువరు ఆరోగ్యసేవలకు రావడంతో అక్కడి నుండి సభ్యులందరి సమ్మతితో సచివాలయంలో కొనసాగించారు. మొత్తం 13 అంశాలపై చర్చ జరగ్గా అందులో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఒకటికి గానూ నలుగురు అభ్యర్థులు అప్లికేషన్లు పెట్టారు. అందులో సభ్యులందరూ ఏకగ్రీవంగా డిగ్రీ చదువుకున్న ఓ వ్యక్తికి కేటాయిస్తున్నట్లు తీర్మానం చేశారు. కాగా 8వ తరగతి చదివిన ఓ మహిళకు అధికార పార్టీకి చెందిన ఓ వర్గం వారు హామీ ఇవ్వటంపై చర్చనడిచింది. అనంతరం వాటర్ స్కీమ్‌లో ఆరుగురు పనిచేస్తుండగా పంచాయతీ నిధులు తక్కువగా ఉండటం కారణంగా జీతాలను తగ్గించేలా చర్చించారు. అయితే 13 మంది సభ్యులో 8మంది తగ్గించాలని, ముగ్గురు మరో సంవత్సరమే కాల పరిమితి ఉందని ఇంతలో తగ్గించడం ఎందుకని ప్రశ్నించారు. ఒక్కరు మాత్రం ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి.

జాయింట్ కలెక్టర్ పరిశీలన

మండలంలోని అంగలకుదురు సొసైటీ బ్యాంకును శుక్రవారం జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ సందర్శించారు. లోన్లు ఇతర వివరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సంగంజాగర్లమూడి సంగమేశ్వరస్వామి వారి ఆలయ భూముల వివాదాలను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామాగ్రి, పుస్తకాలు పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 9: బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వేజండ్ల నవ్య ఉమామహేశ్వరరావు సహకారంతో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు అందించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానం చేరాలని వేజళ్ల ఉమామహేశ్వరరావు చెప్పారు. స్వరూపరాణి, శివరామకృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీదేవిగా కనకదుర్గా భవాని

పొన్నూరు టౌన్, ఆగస్టు 9: పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులోని కనకదుర్గా భవాని అమ్మవారు ధనలక్ష్మీదేవిగా ప్రత్యేక పూజలందుకున్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి జలాభిషేకం, పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం వివిధ రకాల కరెన్సీ నోట్‌లతో అమ్మవారిని ధనలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిలతో కోటి నామకుంకుమార్చన జరిపారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధనలక్ష్మీ అమ్మవారి అలంకారంలో ఉన్న కనకదుర్గ భవానీ అమ్మవారు



పీబీఎన్ కళాశాలలో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

పొన్నూరు టౌన్, ఆగస్టు 9: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని డాక్టర్ షేక్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని పీబీఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో ముఖ్యఅతిధిగా పాల్గొన్న డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు దుర్వసనాలు, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడం వలన భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలు, నెరవేర్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే చెడు పరిణామాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థి దశ భవిష్యత్ ఎంతో కీలకమైనందున సన్మార్గంలో పయనించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సేవా విభాగం సూపరిడెంట్ శ్రీనివాసరావు, ఏఎస్ఐ శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శివకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యూనిట్ ఆఫీసర్‌లు మల్లేశ్వరరావు, జేఆర్ దాస్ పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, చేబ్రోలు, ఆగస్టు 9: మండల పరిధిలోని నండూరు గ్రామానికి చెందిన బొడ్డా వీరయ్య శుక్రవారం మృతి చెందారు. టీడీపీ సీనియర్ కార్యకర్త వీరయ్య మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వీరయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరయ్యకు నివాళులు అర్పించిన వారిలో మండల టీడీపీ మహిళ అధ్యక్షురాలు బుడ్డా శివమ్మ, శ్రీనివాసరావు, వీరయ్య, శివశంకర్‌రావు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు మండలం శేకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మూర్ల శివనారాయణ సతీమణి విజయలక్ష్మి ఇటీవల మృతిచెందారు. శుక్రవారం శివన్నారాయణ గృహానికి వెళ్లిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్ విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పించారు. శివన్నారాయణను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.